క్లుప్తంగా

ముగిసిన పవిత్రోత్సవాలు



తిరుమలగిరి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్య క్షేత్రం వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. స్వామివారికి శాంతి కళ్యాణం, ప్రధాన హోమాలు, పవిత్ర విసర్జన, లక్ష తులసీదళార్చన, మహాపూర్ణాహుతి కార్యక్రమాలను ప్రధానార్చకుడు తిరునగరి రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. లోకకల్యాణార్థం ఏటా స్వామివారి పవిత్ర కల్యాణం నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొమరగిరి భరద్వాజ్, ఏసీ వరప్రసాద్, అర్చకులు అలహరి చక్రపాణి, లక్ష్మీనరసింహాచార్యులు, గోపాలచార్యులు, ద్వారక తిరుమల ఆలయ అర్చకులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీలు వితరణ



పోలంపల్లి(వత్సవాయి): గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి దారెల్లి చిరంజీవి శుక్రవారం పది కుర్చీలను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం జ్యోతి మాట్లాడుతూ చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమంటూ చిరంజీవిని అభినందించారు.

నిష్పక్షపాతంగా వ్యవహరించాలి



వీరులపాడు: సాగునీటి సంఘాల ఎన్నికల విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా వ్యవహరించాలని తహసీల్దార్ హుస్సేన్ సూచించారు. జుజ్జూరులోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని తొమ్మిది మేజర్ ఇరిగేషన్, తొమ్మిది మైనర్ ఇరిగేషన్లకు సంబంధించి శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. పట్టాదారు పాస్ పుస్తకం కలిగి ఉండి 18ఏళ్ల వయసు పైబడిన వారు ఎన్నికల్లో పోటీ చేయవచ్చని తెలిపారు. మేజర్ ఇరిగేషన్‌లో ఒక్కో మేజర్‌కు 12 టీసీలు, మైనర్ ఇరిగేషన్‌లో ఆరు టీసీలకు ఎన్నిక నిర్వహిస్తామని వివరించారు .

రెవెన్యూ సదస్సుకు 10 అర్జీలు

వీరులపాడు: మండలంలోని జమ్మవరం గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ రైతులు 10 అర్జీలు అందజేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ హుస్సేన్ మాట్లాడుతూ ఆయా అర్జీలను పరిశీలించి, ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుంధతీదేవి, సర్పంచ్ మల్లెల అనూషరాణి, ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, మద్దినేని లక్ష్మణరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు కబడ్డీ జిల్లా జట్లు ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్ర జూనియర్ కబడ్డీ పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి కృష్ణా జిల్లా బాల, బాలికల జట్లను ఈ నెల 15వ తేదీన పమిడిముక్కల మండలం, తాడింకి జెడ్పీ స్కూల్‌లో ఎంపిక చేస్తున్నట్లు కృష్ణాజిల్లా కబడ్డీ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి పి.రవి తెలిపారు. 2005 జనవరి 12వ తేదీ తర్వాత పుట్టిన 70 కేజీల లోపు బరువు ఉన్న బాలురు, 65 కేజీల లోపు బరువు ఉన్న బాలికలు ఈ పోటీలకు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న క్రీడాకారులు వారి ఆధార్‌కార్డ్‌తో ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపిక ప్రాంగణానికి చేరుకోవాలని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు రావులపాలెంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని, మరిన్ని వివరాలకు 97040 63555ను సంప్రదించాలని సూచించారు.

యథేచ్ఛగా రోడ్ల ఆక్రమణ

- జగ్గయ్యపేట ప్రధాన రోడ్లలో పెరిగిన ఆక్రమణలు
- నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు
- ఇబ్బందుల్లో వాహనచోదకులు, ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



పేటలో డ్రైనేజీని ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణం

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలో రోడ్ల ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఆక్రమణల కారణంగా రోడ్లన్నీ ఇరుకుమయంగా మారి ఆయా రోడ్లలో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో వాహనచోదకులు, పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య..

రోజురోజుకు పట్టణంలో వాహనాల సంఖ్య పెరుగుతోంది. ఆక్రమణల కారణంగా రోడ్లన్నీ ఇరుకుమయంగా మారి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. పట్టణంలోని కోదాడ రోడ్డు, చిల్లకల్లు రోడ్డు, ముక్త్యాల రోడ్డు, సీతారాంపురంలోని రోడ్డుతో పాటు ఆయా రోడ్ల పక్కనున్న స్థలాలను వ్యాపారులు ఆక్రమించుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో గృహాల యజమానులు రోడ్డును సైతం ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. ఆయా చేతివృత్తులవారు, చిరువ్యాపారులు తమ షాపులను, తోపుడు బండ్లను సైతం రోడ్ల పైనే ఏర్పాటు చేస్తుండటంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతోంది.

రోడ్ల మార్జిన్లు సైతం కబ్జా..

ఆక్రమార్కులు తమ స్వార్థం కోసం రోడ్లు మార్జిన్లను యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. చాలాచోట్ల రోడ్ల మార్జిన్లలో డ్రెయిన్లు కూడా దాటి ముందుకువచ్చి రోడ్డును సైతం కబలిస్తున్నారు. ఇక రోడ్లను ఆక్రమించి మరీ సాగిస్తున్న నిర్మాణాలను అడ్డుకునే సాహసం మున్సిపల్ అధికారుల్లో కొరవడింది. ఇష్టారీతిన సాగుతున్న అక్రమణలను నిలువరించాల్సిన మున్సిపల్ అధికారులే మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రమాదాలకు నెలవుగా రోడ్లు..

యథేచ్ఛగా సాగుతున్న రోడ్ల ఆక్రమణల కారణంగా ఆయా ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా సీతారాంపురం, కోదాడ రోడ్డులో చాలాచోట్ల వ్యాపారులు, గృహ యజమానులు రోడ్డు స్థలంలో ఫ్లోరింగ్ సైతం ఏర్పాటు చేసుకుని సొంతస్థలంలా ఉపయోగించుకుంటుండటం గమనార్హం. ముఖ్యంగా 100 అడుగుల వెడల్పు ఉండాల్సిన కోదాడ, చిల్లకల్లు, ముక్త్యాల రోడ్లు చాలాచోట్ల 50 అడుగుల వెడల్పు కూడా ఉండటం లేదు. అలాగే 60 అడుగుల వెడల్పు ఉండాల్సిన బలుసుపాడు రోడ్డు 20 అడుగుల మేర కుంచించుకుపోయింది. అదేవిధంగా పట్టణంలోని ఆయా రోడ్లలో పశువులు సైతం సంచరిస్తూ ట్రాఫిక్‌కు తీవ్ర అవరోధం కల్పిస్తుండటంతో వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్ల ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



రోడ్లపై యథేచ్ఛగా సంచరిస్తున్న పశువులు

ఆక్రమణలు పెరిగిపోయాయి..



ముక్త్యాలరోడ్డు, బలుసుపాడు రోడ్డు, కోదాడ రోడ్డు, విజయవాడ రోడ్లు తదితర ప్రధాన రహదారుల్లో ఆక్రమణలు పెరిగిపోయాయి. పశువులు, అడ్వర్టజ్‌మెంట్ బోర్డుల కారణంగా కూడా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మున్సిపాలిటీ అధికారులు స్పందించి రోడ్డు ఆక్రమణలను తొలగించాలి.

–ఆర్.ఉపేందర్‌రెడ్డి, దుర్గాపురం

సర్వే చేసి ఆక్రమణలు తొలగిస్తాం..

పట్టణంలో రోడ్ల ఆక్రమణల తొలగింపునకు ఇప్పటికే కార్యాచరణ రూపొందించాం. ఈనెల 14వతేదీలోగా ఆయా ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని గడువు విధించాం.గడువు పూర్తయిన తర్వాత మున్సిపల్ స్థలాలు, రోడ్లలోని ఆక్రమణల తొలగింపు పనులు చేపడతాం. మాపై ఒత్తిడులు ఉన్నప్పటికి విధినిర్వహణలో రాజీపడే ప్రసక్తేలేదు. ఆక్రమణల తొలగింపు పనులు చేపడతాం.

–జి.గోవర్ధన్, టౌన్‌ప్లానింగ్ అధికారి

నేడు పేటలో లోక్ అదాలత్



జగ్గయ్యపేట అర్బన్: స్థానిక కోర్టు ప్రాంగణంలో మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జగ్గయ్యపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రావణి, అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శోభారాణి సూచించారు. లోక్‌అదాలత్ నిర్వహణపై వారు శుక్రవారం కోర్టు హాలులో న్యాయవాదులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జీలు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కోర్టు ఆధ్వర్యంలో ప్రతి వంద రోజులకు ఒకసారి లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లోక్‌అదాలత్ ద్వారా ఆయా కేసులను పరిష్కరించుకోవడం కక్షిదారులకు ఎంతోమేలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ దామాల సంతోష్, ఏజీపీ టీఎల్.నరసింహారావు, న్యాయవాదులు కె.శ్రీనివాసరావు, బూడిద నరసింహారావు, పి.జగ్జీవన్‌రావు, బొడ్డు శ్రీధర్, మాతంగి నరేష్, జుజ్వవరపు అశోక్, మమంతి, పల్లపు రవికుమార్, కరిశె రత్నబాబు, అంకమరాజు పాల్గొన్నారు.

రెండు ట్రై సైకిళ్లు పంపిణీ

నందిగామ టౌన్: లయన్స్ క్లబ్ నందిగామ ఆధ్వర్యంలో తొర్లికొండ నాగచైతన్య జ్ఞాపకార్థం ట్రైసైకిళ్లను అందించడం అభినందనీయమని క్లబ్ అధ్యక్షుడు మందడపు సీతారామయ్య అన్నారు. దాతలు తొర్లికొండ వెంకట్రావ్ అందజేసిన రెండు ట్రై సైకిళ్లను స్థానిక సీతారామాంజనేయస్వామి వారి ఆలయం వద్ద దివ్యాంగులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుమార్తె పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వెంకట్రావ్‌ను అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు, నాయకులు లక్ష్మీకాంత్, తొర్లికొండ సీతారామయ్య, ఆర్ఎల్ నరసింహారావు, మారం సత్యనారాయణ, తుటారి కృష్ణ, యరగొర్ల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి మాజీ సర్పంచి తేళ్ల వెంకటరెడ్డి కన్నుమూత



గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లి మాజీ సర్పంచి తేళ్ల వెంకటరెడ్డి(86)అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. 1987నుంచి 2000 సంవత్సరం వరకు 14ఏళ్లపాటు సర్పంచిగా పనిచేశాడు. సర్పంచిగా వెంకటరెడ్డి గండేపల్లి గ్రామాభివృద్ధికి, రైతుల సంక్షేమం కోసం ఎంతగానో కృషిచేశారు. నేటికీ ఆయన బలపరచిన అభ్యర్థులే గ్రామసర్పంచులుగా ఎన్నికవుతున్నారు. వెంకటరెడ్డి కుటుంబసభ్యులను ఫోన్‌ద్వారా నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్, మాజీమంత్రి వసంత నాగేశ్వరరావు పరామర్శించారు. వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వెంకటరెడ్డి భార్య సామ్రాజ్యం కూడా సర్పంచిగా పనిచేశారు. ఆయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు ‘సముద్రాల’ మృతి



సముద్రాల మధుబాబుకు నివాళులర్పిస్తున్న మాజీఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



మధుబాబు అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్

నివాళులర్పించిన ఎమ్మెల్సీ, మాజీఎమ్మెల్యే

నందిగామ టౌన్: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సూపర్‌బజార్ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకుడు సముద్రాల మధుబాబు (55) శుక్రవారం మృతి చెందారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మధుబాబు ఆరోగ్యం విషమించడంతో తెల్లవారుజామున మృతి చెందారు. మధుబాబు మృతదేహాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్, మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధుబాబు కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వైఎస్సార్ సీపీ అభివృద్ధికి అంకితభావంతో కృషిచేశారన్నారు. మధుబాబు మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన మధుబాబు అంతిమయాత్రలో ఎమ్మెల్సీ అరుణకుమార్, నాయకులు మహ్మద్ మస్తాన్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, సూరె వెంకట రామారావు, నల్లమల్లి మురళి, అనుమోలు పార్థసారథి, పారుపల్లి హరిబాబు, పరిశ మల్లికార్జునరావు, షేక్ జాఫర్, కొమ్మినేని మాలేశ్వరరావు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్నాకు తరలివెళ్లిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

నందిగామ టౌన్: కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన ఏఒక్క హామీని నిలబెట్టుకోలేదని నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు విమర్శించారు. రైతులకు పెట్టుబడి సాయం అందించాలని, రైతు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయవాడ కలెక్టరేట్ వద్ద శనివారం చేపట్టిన నిరసన కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. నందిగామ పార్టీ కార్యాలయం వద్ద ధర్నాకు తరలిన వాహనాలను డాక్టర్ జగన్‌మోహనరావు జెండాఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేసిందన్నారు. వర్షాలు, వరదలకు పంట నష్టపోయిన రైతులకు సైతం పూర్తిస్థాయిలో పంట నష్ట పరిహారం అందించడంలో విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎంపీపీ ఆకుల హనుమంతరావు, పార్టీ మండల కన్వీనర్ మంచాల చంద్రశేఖర్, నాయకులు చిరుమామిళ్ల శ్రీనివాసరావు, నెలకుదిటి శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

జగ్గయ్యపేటలో...

జగ్గయ్యపేట అర్బన్: రైతుల సమస్యల పరిష్కారం కోసం మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు విజయవాడ కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమానికి జగ్గయ్యపేట నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్(చిన్నా)తో పాటు కార్లు, బస్సులలో నాయకులు, కార్యకర్తలు, రైతులు విజయవాడకు తరలివెళ్లారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు/వత్సవాయి: విజయవాడలో తలపెట్టిన నిరసన కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికారప్రతినిధి వేల్పుల రవికుమార్, ఎంపీపీల సంఘ రాష్ట్ర అధ్యక్షులు మార్కపూడి గాంధీ, మండల పార్టీ అధ్యక్షులు కనకపుడి భాస్కరరావు ఆధ్వర్యంలో ఆపార్టీ శ్రేణులు తరలివెళ్లాయి. వత్సవాయి మండలంలోని వత్సవాయి, పోలంపల్లి, కంభంపాడు, మక్కపేట, భీమవరం గ్రామాల నుంచి కూడా భారీసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కూటమి ప్రభుత్వం రైతులకు తీరని అన్యాయం చేస్తోందని మండిపడ్డారు.

దత్త జయంతి ఉత్సవాలు ప్రారంభం



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మహిళలు

వీరులపాడు: మండలంలోని జుజ్జూరులో వేంచేసియున్న యజ్ఞ దత్తాత్రేయస్వామి వారి ఆలయంలో దత్త జయంతి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహోత్సవాలలో భాగంగా ఆలయ ప్రధానార్చకుడు యనమదల ప్రసాద్‌శర్మ, వేద పండితుడు మద్దూరి యజ్ఞనారాయణ సోమయాజులు ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. గణపతిపూజ, గోపూజ, అఖండ స్థాపన, దీక్షాధారణ, తైలాభిషేకం, మండపారాధన, దత్త హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు వ్రతంలో పాల్గొ విశేష పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. రాత్రికి స్వామి వారిని గరుడ వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పమిడిమర్రి జగన్‌మోహనరావు, నరసింహమూర్తి, కానూరు వెంకట్, కృష్ణప్రియ, సుబ్బారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల నిర్వహణ



గనిఆత్కూరు(కంచికచర్ల): రైతుల భూవివాదాలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ పి.జాహ్నవి తెలిపారు. మండలంలోని గనిఆత్కూరు గ్రామ సచివాలయంలో శుక్రవారం గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయా భూసమస్యల పరిష్కారం కోరుతూ రైతులు 12 అర్జీలు అందజేశారు. తహసీల్దార్ జాహ్నవి మాట్లాడుతూ ఆయా అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. ఆయా గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకట్, వీఆర్వో సునందారాణి, రైతులు పాల్గొన్నారు.

నందిగామ మండలంలో..

నందిగామటౌన్: రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని ఆర్ఐ వేణుకుమారి పేర్కొన్నారు. మండలంలోని సోమవారం గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను వినియోగించుకుని రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతులు అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాలబోయిన వెంకటనరసింహం, నాయకులు ఉప్పుకొండూరు గురుప్రసాద్, జంగాల శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ నేతలపై అణచివేత

రైతుల సమస్యలపై విన్నవించేందుకు వెళుతున్న వైఎస్సార్ సీపీ నాయకులపై పోలీసులు అణచివేత చర్యలుచేపట్టారు. విజయవాడలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళుతున్న శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్, వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, పెనుగంచిప్రోలు ఎంపీపీ మార్కపూడి గాంధీ, బద్దూనాయక్ తదితర నాయకులను పోలీసులు కలెక్టరేట్ వద్ద అడ్డుకునేందుకు యత్నించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

- నీటిసంఘాల ఎన్నికలకు సర్వంసిద్ధం
- 18 మేజర్, 13మైనర్ సంఘాలకు ఎన్నిక
- 43,409 మంది ఓటర్లు

జగ్గయ్యపేట: నియోజకవర్గంలో శనివారం నిర్వహించనున్న మేజర్, మైనర్‌నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లోని ఆయకట్టు గ్రామాలలో నీటి సంఘాల ఎన్నికలు నిర్వహణకు ఆయా మండలాల్లోని రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

నియోజకవర్గంలో మేజర్ 18, మైనర్ నీటిసంఘాలు 13ఉన్నాయి. 43,409 మంది రైతులు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగుతుంది. మధ్యాహ్నం మూడు నుంచి ఐదు గంటల వరకు అధ్యక్ష, ఉపాధ్య ఎన్నిక నిర్వహిస్తారు. 349మంది అధికారులు ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు.



బూదవాడలో పోలింగ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో నితిన్

ఏర్పాట్ల పరిశీలన..

మండలంలోని బూదవాడ మండల పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో నితిన్ శుక్రవారం పరిశీలించారు. అక్కడ సిబ్బందికి కావాల్సిన వసతులను సిద్ధం చేయాలని పంచాయతీ అధికారులను కోరారు.

అవగాహన కల్పించకుండానే..

నీటి సంఘాల ఎన్నికలపై ఓటర్లకు అవగాహన కలిగించకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. కేవలం కొన్నిగ్రామాల్లోనే తూతూమంత్రంగానే తాంతాం నిర్వహించారని, ఓటుహక్కు వినియోగంపై కనీసం అవగాహన కల్పించలేదని రైతులు ఆరోపిస్తున్నారు.

నందిగామ నియోజకవర్గంలో..

కంచికచర్ల: నియోజకవర్గంలోని ఆయా నీటిసంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ కె.బాలకృష్ణ శుక్రవారం తెలిపారు. నియోజకవర్గంలో 25 ఎన్ఎస్పీ, 60ఐడీసీ, 16 మైనర్ ఇరిగేషన్ శాఖలకు సంబంధించిన నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఎన్నికల ప్రక్రియ ఉంటుందన్నారు. రైతులకు పట్టాదార్ పాసుపుస్తకం కలిగి ఉండటంతోపాటు సహకార సంఘాల్లో సభ్యత్వం ఉన్నవారికి ఓటుహక్కు ఉంటుందన్నారు. నీటిసంఘాల పరిధిలోని ఆయా జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు ఆర్డీఓ వివరించారు.